నవభూమి
జిల్లా అనుబంధం
20 అక్టోబర్,2024 ఆదివారం | పేజీలు:7
www.epaper.navabhoomi.in

# మద్యం ధర.. గుండె దడ

**శ్రీ సత్యసాయి జిల్లా-నవభూమిబ్యూరో** 'తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇస్తాం' అని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన చంద్రబాబు.. .అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కారు. నూతన మద్యం పాలసీ పేరుతో ఇన్నాళ్లు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు.

జిల్లాలోని 87 దుకాణాలకు టెండర్లు పిలిచి లాటరీ పేరుతో కూటమి నేతలకు కట్టబెట్టారు. మద్యం వ్యాపారులంతా సిండికేట్ కాగా, మద్యం ధర చూస్తేనే మందుబాబులకు కై పెక్కుతోంది. 'నమ్మినందుకు నడ్డివిరగొడుతున్నావు కదయ్యా' అంటూ మద్యం ప్రియులు మండిపడుతున్నారు.

**చీప్ లిక్కర్ రూ.130..**

తాము అధికారంలోకి రాగానే రూ.99కే క్వార్టర్ మద్యం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. జిల్లా వ్యాప్తంగా ఏ మద్యం దుకాణంలోకి వెళ్లి అడిగినా ఆ సరుకు ఇంకా రాలేదనే సమాధానమే వినబడుతోందని మద్యం ప్రియులు చెబుతున్నారు. చీప్ లిక్కర్ (క్వార్టర్) రూ.130గా ధర నిర్ణయించారని వారంతా గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కనిష్ట మద్యం (క్వార్టర్) ధర రూ.120 ఉండేదని మందుబాబులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం క్వార్టర్ పేరుకు రూ.130 అని చెబుతున్నా.. దుకాణాల్లో రూ.150 వసూలు చేస్తున్నారంటున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో టీడీపీ మద్యం పాలసీపై సైటెర్లు వేస్తూ పోస్టింగ్‌లు పెడుతున్నారు.

**పేరుకే లాటరీ..**

జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 87 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వగా...1,460 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల రుసుము వసూలు చేసింది. ఈ నెల 14వ తేదీన పుట్టపర్తిలోని సాయిఆరామంలో లాటరీ తీసి మద్యం దుకాణాలను కేటాయించారు. లాటరీ తీశాం...అంతా పారదర్శకమని అధికారులు చెబుతున్నా... 90 శాతానికిపైగా దుకాణాలు అధికార కూటమి పార్టీ నేతలు, వారి అనుచరులే దక్కించుకున్నారు. అందుకే వారు నిర్ణయించిందే ధర అన్నట్టు వ్యవహరిస్తున్నారని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏ బ్రాండ్ ఎంత?**

కొత్త మద్యం పాలసీ మద్యం ప్రియులను తీవ్ర నిరశకు గురిచేసింది. మెక్‌డోల్ విస్కీ క్వార్టర్ రూ.180, మ్యాన్షన్ హౌస్ రూ.220, రాయల్ స్టాగ్ రూ.230, బ్లెండర్స్‌ప్రైడ్ రూ.360, హండ్రెడ్ పైపర్స్ రూ.670, టీచర్స్ స్పెషల్ రూ.690గా ధర నిర్ణయించారు. అయితే మ్యాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ రూ.220 నుంచి రూ.260 వరకు, ఓల్డ్‌మంక్ బ్రాందీ రూ.270 దుకాణాల్లో అమ్ముతున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. స్ట్రాంగ్ బీర్లకు రూ.220 నుంచి రూ.270 దాకా తీసుకుంటున్నారని చెబుతున్నారు.

**దుకాణం తెరిచారు..**

జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు మద్యం వ్యాపారులతో రాయ'బేరం' నడిపారు. ప్రతి నెలా 20 నుంచి 30 శాతం కమీషన్ ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే కొందరు బహిరంగంగా చెబుతున్నారు. 'మీరు ఇక్కడ వ్యాపారం ఎలా చేసుకుంటారో నేనూ చూస్తా.. మీరేం చేసుకుంటారో..ఎంతకు అమ్ముకుంటారో మాకు అనవసరం. ప్రతి నెలా మేము చెప్పినంత కమీషన్ ఇవ్వాల్సిందే'అని బెదిరిస్తున్నారని మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు వాపోతున్నారు.

**తక్కువ ధరకు మద్యం హామీ హుళక్కే**
చీప్ లిక్కర్ క్వార్టర్ రూ.130
చాలా చోట్ల ఎమ్మార్పీకి మంగళం
మోసపోయామంటున్న మందుబాబులు
సామాజిక మాధ్యమాల్లోనూ
వైరల్‌గా మారిన సైటెర్లు



## రెండు గ్రామాల మధ్య చిచ్చు పెట్టిన

# ఇసుక రవాణా

- రెండు గంటల పాటు నిలిచిన రాకపోకలు
- లాకుల కూడలిలో రహదారిపై వాహనాలు అడ్డుపెట్టిన ప్రజలు
- ఆందోళన చేస్తున్న వారితో ఎస్సై ఏడుకొండలు చర్చలు

**కొల్లూరు-నవభూమి:** మండలంలో పెసర్లంక సమీపంలో కృష్ణానది నుంచి రెండ్రోజులుగా ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణా రెండు గ్రామాలకు చెందిన వారి మధ్య శనివారం చిచ్చుపెట్టింది.

ఫలితంగా కొల్లూరుకు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని తన వాహనాన్ని నిత్యం రద్దీగా ఉండే కొల్లూరు లాకుల కూడలిలో రహదారిపై అడ్డుగా పెట్టడంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచాయి. రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల రంగ ప్రవేశంతో ఉద్రిక్తతకు తెరపడడంతో పాటు రాకపోకలు యథావిధిగా సాగాయి. వివరాలు ఇలా.. పెసర్లంక సమీపంలో కృష్ణానది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసే ఇతర గ్రామాలకు చెందిన వారు ఒక్కో వాహనానికి రూ.500 చొప్పున తమ గ్రామంలో శివాలయం మరమ్మతుల నిమిత్తం చెల్లించాలని పెసర్లంకకు చెందిన కొందరు షరతు విధించారు.

ఇందుకు నిరాకరించిన కొల్లూరుకు చెందిన కనపాలు బాబూరావు తన ట్రాక్టర్‌లో తెస్తున్న ఇసుకను పెసర్లంకలోనే పోసి నేరుగా వచ్చి లాకుల కూడలిలో రహదారిపై తన ట్రాక్టరును అడ్డుగా నిలిపాడు. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. కొల్లూరు చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులతో పాటు మరి కొందరు బాబూరావుకు మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న పెసర్లంకకు చెందిన కొందరు లాకుల కూడలికి చేరుకున్నారు. ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బు వసూలు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పాఠశాల నుంచి విద్యార్థులను ఇళ్లకు చేరవేసే బస్సులు, ఆర్టీసీ బస్సులతో పాటు పలు వాహనాలు ఇరువైపులా పదుల సంఖ్యలో నిలిచి పోయాయి. రెండు గంటల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. సమాచారం అందుకున్న ఎస్సై ఏడుకొండలు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి, రహదారికి అడ్డుగా నిలిపిన వాహనాన్ని తొలగించారు. పెసర్లంకకు చెందిన సాతా శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడంతో ఉద్రిక్తతకు తెరపడింది. రాకపోకలకు మార్గం సుగమమైంది. వాహనాలు నిలిచి పోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.



# కరెంటు చార్జీలు తగ్గించాలి సిపిఎం పార్టీ డిమాండ్




**మాడుగుల అక్టోబర్ నవభూమి** మాడుగుల : ఇటీవల కాలంలో నూతన విద్యుత్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చి అదిక కరెంట్ చార్జీల పేరుతో వసూలు చేస్తుందని మాడుగుల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఇ.నరసింహ మూర్తి , మండల నాయకురాలు భవాని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండేటటువంటి ప్రజలందరికీ గతంలో వాడుకున్న విద్యుత్తు కు నేడు బిల్లులు కట్టించు కునే విధానం మానుకోవాలని , విద్యుత్ చార్జీల్లో ఇందన సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీలు వసూళ్ల వెంటనే రద్దు చేయాలని , కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై 20వేల కోట్ల భారాలను వెంటనే రద్దు చేయాలని కార్పొరేటర్ల కు వరాలు కట్టబెట్టి సామాన్య ప్రజలపై బారాలు మోపి విద్యుత్ సంస్కరణ వెంటనే మానుకోవాలని , గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి విద్యుత్ సవరణ చట్టాలు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన, వ్యతిరేకించాయి. కానీ ఈనాడు అధికారంలోకి రాబోయే సరికి అదేవిధంగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పని తీరును సిపిఎం పార్టీ ఖండిస్తుంది.ప్రజలు దిన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ విధానాల అమలు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని నరసింహమూర్తి అన్నారు.ఈ కార్యక్రమంలో బుసరి మల్లుదోర బచ్చుల ఈశ్వర రావు , కోర్రా నాగర్జున విజయశాంతి , అచ్చిబాబు , చిన్నారావు బాలక్రిష్ణ , సన్యాసి రావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నదాత సత్తిరాజు వర్ధంతి నిరుపేదలకు వస్త్రదానం

**ఉప్పలగుప్తం (నవభూమి)** చిక్కంసత్తిరాజు అన్నదాన సత్రం సత్తిరాజు వర్ధంతి శనివారం సి ఎస్ ఎం ఎం ఎస్ ఎస్ కళాశాల ఆవరణంలో సత్తిరాజు కుటుంబ సభ్యులు కళాశాల కమిటీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు అనంతరం వస్త్రధానాలు అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కస్పాండెంట్ చిక్కం వీర వెంకట ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ కొత్తూరి వెంకటరాజు కోశాధికారి మోటూరి సుబ్రమణ్యం పాలకవర్గ సభ్యులు ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ, కుటుంబ సభ్యులు వంశాదారులు చిక్కం గోపాలకృష్ణ, చిక్కం పద్మనాభం, చిక్కం బాలసుబ్రమణ్యం, చిక్కం సూర్యనారాయణమూర్తి , చిక్కం సత్తిరాజు, చిక్కం విశ్వనాథం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి డి ఈశ్వరరావు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు అనంతరం కుటుంబ సభ్యులు 200 నిరు పేదలులకు వస్త్ర దానం పంపిణీ చేశారు





# సంక్షేమ పథకాలు నిరుపేదకు అందించాలి

◆ పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్



**బాపట్ల** కేంద్రం నిధులతో అమలయ్యే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి నిరుపేదకు అధికారులు అందించాలని పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) శనివారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. కమిటీ చైర్మన్ గా పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెడుతున్న ప్రతి పైసా నిరుపేదకు చేరాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు అన్నారు. అత్యంత పారదర్శకంగా పథకాలు అమలు కావాలి, అభివృద్ధి పనులు జరగాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుక బాటులో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరాలని ఆయన సూచించారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఐదో స్థానంలోకి ఎదగాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని వివరించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికి విద్య అందడం, యువత నైపుణ్యాలు అభివృద్ధి చేయడం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. ప్రాథమిక వైద్యం ప్రతి ఒక్కరికి అందాలి, ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ఉపాధి చూపించాలని ఆయన చెప్పారు. అభివృద్ధి పనులు, ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. స్వచ్ఛ భారత్, పేదరిక నిర్మూలనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయన్నారు. 44 పథకాలకు కేంద్రం నిధులు వస్తున్నాయన్నారు. బాపట్ల జిల్లాలో యువతకు ఉపాధి చూపడం, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, స్వయం ఉపాధి కల్పించడమే ప్రాధాన్యతగా పనిచేయాలన్నారు. అన్ని శాఖలలో కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు పెండింగ్లో ఉంటే స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆయన సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదరికం నుంచి ప్రజలు విముక్తి పొందేలా అధికారులు పనిచేయాలని పార్లమెంట్ సభ్యులు కృష్ణప్రసాద్ తెలిపారు. 3.50 లక్షల కుటుంబాలు జిల్లాలో ఉన్నాయన్నారు. అర్హులైన ఎస్టీలందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా అధికంగా పనులు కల్పించాలని తెలిపారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా జరగాలన్నారు. యువతలో నైపుణ్యాలకు అభివృద్ధి కల్పించే దిశగా శిక్షణ ఇవ్వాలన్నారు. గృహాల నిర్మాణాలలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఇళ్ల గురించి ఆరా తీశారు. సమగ్ర వివరాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. 1.38 లక్షల మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జల జీవన్ మిషన్ కింద రూ.578 కోట్ల నిధులు మంజూరు కాగా 40 శాతానికి మించి పనులు చేయకపోవడం ఏమిటని ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను ఆయన నిలదీశారు. పనులు చేసినప్పటికీ నిధులు విడుదల కాలేదని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. నిలిచిన నిధులపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆయన చెప్పారు. 1.50లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు, పర్యవేక్షణ ఉండాలన్నారు. చిరు ఉద్యోగులు, కార్మికుల కొరకు బాపట్లలో ఈఎస్ఐ హాస్పిటల్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 17వ లోక్ సభ నిధుల మంజూరు, వినియోగంపై అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. గతంలో ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. ముద్ర రుణాలు లక్షాలకు మించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. లక్ష్యాలు చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే లక్ష్యాలు చేరుకోగలమని ఆయన వివరించారు. ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు.గ్రామాలలో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. గ్రామాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని ఆయన వివరించారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంతో ప్రభుత్వం నిధులిస్తుందన్నారు. ప్రజలకు సక్రమంగా పథకాలు చేరుతున్నాయా లేదా పర్యవేక్షించడానికే దిశ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరుగుతుందన్నారు. ఎస్టీలందరికీ జాబ్ కార్డులు జారీ చేసి పనులు ఉపాధి చూపాలని ఆదేశించారు. పల్లె వనాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 19 మండలాలలో 19 వేల ఇంకుడు గుంతలు తీయాలని లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.6,000లు నిధులు వెచ్చిస్తుందన్నారు. అన్ని పథకాలు సమర్ధంగా అమలవుతున్నాయని ఆయన వివరించారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో సమగ్ర విచారణ చేసి అర్హులకు మాత్రమే పింఛన్ అందించాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. అక్రమ పింఛన్ ఏరివేత జరగాలన్నారు. పింఛన్ సొమ్ము కాజేసిన వారి నుంచి ఆర్ఆర్ చట్టం ద్వారా నగదు వసూలు చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంతో విచారించాలన్నారు. ఉపాధి హామీ పనులపై గ్రామాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పీవీపాలెం మండలంలో పండ్ల మొక్కలు నాటి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చట్టాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధికారి సిహెచ్ సత్తిబాబు, ప్రకాశం జెడ్పి సీఈవో చిరంజీవి, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన

**మామిడికుదురు. అక్టోబర్.19. నవభూమి. .** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడి కుదురు మండలం 216 జాతీయ రహదారి పాశ ర్లపూడి నుండి రాజోలు వెళ్లే ప్రధా రహదారి మొత్తం గుంతలతో అధ్వానంగా మారింది చిన్నపాటి వర్షానికి గుంతలలో నీరు చేరి వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారు .ఈమార్గం నుంచి నిత్యం వేలాది సంఖ్యలో ద్విచక్ర వాహనాలు. లారీలు. ఆటోలు. ఆర్టీసీ బస్సులు. స్కూలుకు వెళ్లే బస్సులు వెళుతుంటాయి అనునిత్యం ఈ రహదారి రద్దీగానే ఉంటుంది సుమారు రెండు కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గుంతలు తో నీరు నిల్వలతో ఎన్నో గత యాల నుంచి బాధలు తప్పట్లేదు గతంలో చాలామంది ప్రయాణికులు యాక్సిడెంట్లై గురై పలు సంఘటనలు చోటుచేసుకున్నాయి.. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే . గర్భిణీ స్త్రీలు వృద్ధులు ప్రయాణం చేయాలంటే. బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ప్రయాణికులు వా పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి . రోడ్డు నిర్మాణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుచున్నారు.



## పారదర్శకంగా ఉచిత ఇసుక ర్యాంపుల నిర్వహణ



**అమలాపురం. అక్టోబర్19(. నవభూమి జిల్లా ప్రతినిధి )** పారదర్శకంగా ఉచిత ఇసుక ర్యాంపుల నిర్వహణ. కలెక్టర్ మహేష్ కుమార్. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో ఉచిత ఇసుక పాలసీ ద్వారా ఉచిత ఇసుక ర్యాంపులను పారదర్శకంగా నిర్వహించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. శనివారం రావులపాలెం మండల పరిధిలోని ఊబలంక ఇసుక రీచును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నీరు తగ్గిన పిదప ఇసుక తవ్వకాలకు చర్యలు చేపడుతూ పార దర్శకంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయా లని ఇసుక లభ్యత, వాహనాలు సరఫరా ఆన్లైన్ ఆఫ్లైన్ విధానంలో ఇసుక బుకింగ్ వాహనాల బుకింగ్ ప్రక్రియలపై ఇసుక రీచ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించా లని అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎటువంటి అపోహలకు తావు లేకుండా నిర్వ హించాల్సిన బాధ్యత సంబంధిత . అధికారులు దేనని. ఇసుక రీచ్ సరిహద్దులను మ్యాపులు ఆధారంగా గుర్తించి ఇసుక ర్యాంపు నిర్వహణపై అధికారులకు కలెక్టర్ తగు సూచనలు సలహాలు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి అశోక్ కుమార్, రియాల్టీ ఇన్స్పెక్టర్ సుజాత, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షించాలి

### ఎంపీ తన్నేటి కృష్ణ ప్రసాద్

**బాపట-నవభూమి:** సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని బాపట్ల పార్లమెంటు సభ్యులు, లోక్ సభ ప్యానల్ స్పీకర్, హోమ్ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో రూ. ఐదు లక్షల నిధులతో ఏర్పాటుచేసిన ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ను పార్లమెంట్ సభ్యులు శనివారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు కలిసి జ్యోతి వెలిగించారు.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని పార్లమెంటు సభ్యులు చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియపరచాలన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండడంతో వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ప్రతి ఏటా ఎంపీ ల్యాడ్స్ కింద పార్లమెంట్ నియోజకవర్గానికి రూ.ఐదు కోట్ల నిధులు పార్లమెంట్ నుంచి విడుదలవుతాయన్నారు. వాటిని ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. కేంద్రం నిధులను పర్యవేక్షించడానికి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరపాల్సి ఉందన్నారు. కేంద్రం నిధులు మంజూరయ్యే ఆయా శాఖల అధికారులంతా సమన్వయంతో పని చేస్తే జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన వివరించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, సిపిఓ శ్రీనివాసులు, ఆర్ డి ఓ పి గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.




## క్రీడారంగానికి పూర్వ

# వైభవం తీసుకొస్తాం

- ◆ త్వరలో స్పోర్ట్స్ పాలసీలను ప్రకటిస్తాం
- ◆ క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ◆ శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు





**నెల్లూరు,అక్టోబర్ 19,(నవభూమి)::** రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని,గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన క్రీడారంగానికి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు.నెల్లూరు జిల్లాలోని మొఘళ్లపాలెంలో జరుగుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నెల్లూరు పట్టణంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంను శనివారం ఆయన పరిశీలించారు.తొలుత మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పనులను పరిశీలించి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో ఆయన సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని,మరో 15రోజుల్లో ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంను పరిశీలించి నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు,సౌకర్యాల కల్పనపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కేవీకేలు,ఇండోర్ స్టేడియంలు, అవుట్‌డోర్ స్టేడియంలు,డీఎస్ఏల పనితీరు, క్రీడారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు.2017లో మాజీ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కోరిక మేరకు అప్పటి ప్రభుత్వం 150 ఎకరాల భూమిని మల్టీపర్పస్ క్రీడా వికాస కేంద్రం కేటాయించిందని, రూ.8కోట్లతో నిర్మాణాలను చేపట్టి సుమార్ 90శాతం పనులను కూడా పూర్తి చేసిందన్నారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం క్రీడారంగాన్ని నిర్వీర్యం చేసిందని, ఐదేళ్లుగా రాష్ట్రంలోని క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు,స్టేడియాల నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు.మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని,పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి మరో 15రోజుల్లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.2027లో నేషనల్ గేమ్స్‌ను మన రాష్ట్రంలోనే నిర్వహించాలనే ధృఢసంకల్పంతో చంద్రబాబునాయుడు ఉన్నారని, దానికి తగ్గట్టుగానే అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేలా క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆకాంక్షిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఆట స్థలాలు లేని 4039 పాఠశాలలను గుర్తించి ఆట స్థలాలు ఏర్పాటు చేసేలా జీవోలను సైతం తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లు దుర్వినియోగం చేసిందని, క్రీడారంగాన్ని రాజకీయక్రీడగా మార్చిందన్నారు.కూటమి ప్రభుత్వం మాత్రం క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అనేకమైన స్పోర్ట్స్ పాలసీలు తీసుకొస్తుందని, ఇటీవల 53 క్రీడలకు సంబంధించిన అసోసియేషన్లతో సమావేశం నిర్వహించామన్నారు.ఇప్పటికే సీఎం చంద్రబాబు నిర్వహించిన స్పోర్ట్స్ రివ్యూలో పాల్గొన్నామన్నారు.క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు,సౌకర్యాలు కల్పించి దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తయారుచేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేవీకేలు,ఇండోర్,అవుట్‌డోర్ స్టేడియంల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ముఖ్యంగా క్రీడారంగంలో పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు,ఔత్సాహికులు,మాజీ క్రీడాకారులు భాగస్వాయ్యం కావాలని పిలుపునిచ్చారు.మంత్రి లోకేష్ కూడా క్రీడారంగంలో పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నారని దాని కారణంగా క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ ఆర్కే ఎథిరాజులు నెల్లూరు నియోజకవర్గ నాయకులు చేజేర్ల వేంకటేశ్వర రెడ్డి,పలువురు నాయకులు,కార్యకర్తలు,క్రీడాకారులు,కొచ్ లు,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్త టైలర్ల సమస్యల మీద

# ముఖ్యమంత్రికి వినతి పత్రం

- ◆ ముస్లింమైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రఫీ

**అమరావతి, అక్టోబర్ 19 ( నవభూమి )** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ మర్యాదపూర్వం కలవడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్త టైలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. తొందరలో కొత్త పెన్షన్ల కార్యక్రమం మొదలవుతున్న సందర్భంగా. ప్రత్యేకించి టైలర్లకి 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని మరియు టైలరింగ్ షాపులకు రాయితీ మీద విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు ఇవ్వబడుతున్న యూనిఫారం దుస్తులు కుట్టడానికి టైలర్ సంఘాలకి ఇవ్వాలని టైలర్లకు కంటి చూపు పరీక్షలు చేపించి ఉచితంగా కళ్లద్దాలు సరఫరా చేయాలని ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి వాటి మీద తగువిధంగా ప్రభుత్వం స్పందించి టైలర్లకు ఉపాధిపరంగా మరియు జీవనఅభివృద్ధికి అనుగుణంగా ప్రభుత్వ స్పందించా లని కోరుకుంటూ ముఖ్యమంత్రివర్యులకు విన్నవించుకోవడం జరిగింది.



## బడి పిల్లల ఆకలి కేకలు వినిపించడం లేదా..?



**కూనవరం నవభూమి న్యూస్ :** మండలంలోని శ్రీ మార్తా శ్రీరాంమూర్తి భవన్ లో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్బంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ ముల్లూరు నుండి బొజ్జరాయిగూడెం పాఠశాలలో మధ్యాన్న భోజన పధకానికి బియ్యం అందించడం లేదని అన్నారు.ప్రభుత్వాలు మారుతున్న విద్యార్థుల తలరాతలు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.గడచిన మూడు నెలల కాలంలో ప్రభుత్వ పాఠశాలలకు అందించవలసిన బియ్యాన్ని అందించకపోవడం విద్యార్థిని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యార్థులకు అందించే బియ్యం విషయంలో పొరపాటు ఎక్కడ జరిగిందో పర్యవేక్షించి ప్రభుత్వ పాఠశాలలకు నిరంతరాయంగా బియ్యం పంపిణీ జరిగే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కొమరం పెంటయ్య,ఎంపీటీసీ అమ్మాజి, సర్పంచులు మడకం నాగమణి, బొగ్గా వెంకమ్మ, పాయం సత్యనారాయణ,తాళ్లూరు శ్రీనివాసరావు, ఆవుల మురళి,బొగ్గా రామారావు,శంకర్ ఆవుల ఉపేంద్ర,బాబు బొర్రయ్య, నానుపల్లి వెంకటేశ్వరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## రాజుపల్లిలో పల్లెపండగ



**పెద్దపంజాణి నవభూమి అక్టోబర్ 20** పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండల కేంద్ర పరిధిలోని రాజు పల్లి గ్రామంలో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం దీనిలో ప్రధానంగా గ్రామీణ రోడ్ల అనుసంధానం చేయడం, గ్రామాల్లో సిసి రోడ్లు, మురికినేటి కాలువలు నిర్మాణం, ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయడం జరుగుతుంది రాజు పల్లి గ్రామంలో పలమనేరు శాసనసభ్యులు మాజీ మంత్రి శ్రీ ఎన్ అమరనాథ రెడ్డి సహకారంతో 5.50 లక్షలతో సిమెంట్ రోడ్ మంజూరు కావడంతో నిర్మాణానికి భూమి పూజ చేసిన మాజీ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి భాను ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రిజ్వాన, శివ,ఇంజనీరింగ్ సహాయకులు శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలకృష్ణారెడ్డి,మంజునాథరెడ్డి, నాగరాజు యాదవ్,చందు యాదవ్, జైపాల్ రెడ్డి, ఎలాప్ప,గణేష్, అమరనాథ్, మునింద్ర, అది,భాస్కర్ రెడ్డి,పవన్, సచివాలయ సిబ్బంది బాలాజీ, శ్రీలేఖ, నాగ రేఖ, సురేష్, సాయి మోహన్,మహేష్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

## అనుమానాస్పద కేసును జాప్యం చేస్తున్నారంటూ నిరసన

**వేటపాలెం,అక్టోబర్ 19 ( నవభూమి)** వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామానికి చెందిన పులి శ్రీనివాస్ ఇటీవల అనుమానస్పదిరితిలో మృతి చెందిన నేపథ్యంలో కేసు విచారణలో పోలీసులు జాప్యం చేస్తున్నారంటూ మండలంలో ఉన్న యాదవ సంఘాలు స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు యాదవ నాయకులు ఆరోపించారు. అనుమానస్పదరితలో మృతి చెంది రోజులు గడుస్తున్నప్పటికీ దర్యాప్తులో పురోగతి లేదని వారు విమర్శించారు. హత్య చేసిన దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.




# ఆత్మకూరు అభివృద్ధి..

# భవిష్యత్ తరాల ప్రయోజనమే లక్ష్యం

- పారిశ్రామికంగా ఆత్మకూరు అభివృద్ధికి అపార అవకాశాలు
- నాయకులు,కార్యకర్తల సూచనలతో అభివృద్ధి పనులు
- త్వరలోనే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభం
- ఆత్మకూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు



**నెల్లూరు,అక్టోబర్ 19,(నవభూమి)::** సోమశిల,హై లెవెల్ కెనాల్,సంగం బ్యారేజ్ సాగునీటి ప్రాజెక్టులు, మూడు జాతీయ రహదారులు,రైల్వే లైను ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలతో ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని,అన్ని రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.శనివారం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో అనంతసాగరం, మర్రిపాడు మండలాల పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన మంత్రి, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పరిశ్రమలు,ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు,వివిధ రెసిడెన్షియల్ కళాశాలల ఏర్పాటు, స్కిల్ కళాశాల ఏర్పాటు,నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నట్లు మంత్రి చెప్పారు.ఆత్మకూరులో ఈ ఏడాది నుంచి బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ప్రారంభిస్తామన్నారు.ఆత్మకూరు నియోజకవర్గం లోని గ్రామపంచాయతీలో ఆలయాల మరమ్మతులకు 5 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని,నాయకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు.రూ 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు రూ 10వేలు ఈ నెల నుంచి మంజూరు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను మొదలుపెట్టనున్నామని,నాయకులందరూ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను సూచించాలని చెప్పారు.అలాగే మండలానికి ఒకటిన్నర కోటి రూపాయలు సీసీ రోడ్లకు ఉపాధి హామీ పనులు మంజూరయ్యాయని చెప్పారు. రూ. 5 కోట్లతో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు.ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ లపై చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే రేషన్ షాప్ దుకాణాల్లో కూడా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తన అభ్యర్థన మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 50 గోకులాలను మంజూరు చేశారని చెప్పారు.గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని తెలియజేశారు.ఈ సమావేశంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి,రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్,స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.




## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించండి..

# పర్యావరణాన్ని కాపాడండి

**నెల్లూరు,అక్టోబర్ 19,(నవభూమి)::** ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణానికి పాటుపడాలని సినీ దర్శకులు డాక్టర్ ఎన్. గోపాలకృష్ణ పిలుపునిచ్చారు.పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నెల్లూరు జాకీర్ హుస్సేన్ నగర్ లోని ఎస్.వి.ఆర్.హైస్కూలు నందు "ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం! పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!! అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనుగడకోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కోరారు. ఎస్.వి.ఆర్.స్కూలు కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే ప్లాస్టిక్ వాడకంపైన ఒక అవగాహన కలిగి ఉండాలని కోరారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సినీ దర్శకులు డాక్టర్ ఎన్.గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.రమేష్ బాబు,ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కూరపాటి శ్యాందన్,పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు,ఉపాధ్యాయులు అంకబాబు,విద్యార్థులు, పాల్గొన్నారు
.





# అంధకారంలో సూర్యలంక రోడ్డు

## ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు





**బాపట్ల :** మండలంలోని సూర్యలంక రోడ్డు ఆదర్శనగర్ కాలువ వద్ద నుండి సూర్యలంక వరకు గత వారం రోజుల నుండి వీధి దీపాలు వెలగడం లేదు.వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులకు బాగా ఇబ్బందికరంగా ఉందని రోడ్లపై ఆవులు,గేదెలు తిరుగుతుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆదర్శనగర్ గ్రామస్తులు తెలిపారు. వీధి దీపాలు వెలిగిన అక్కడక్కడే వెలుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం పట్ల..ముస్లిం మైనార్టీలో సర్వత్రా హర్షం

## రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి ఏండీ ఖలీలుద్దీన్



**గుంటూరు, అక్టోబర్ 19 (నవభూమి)** రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల విద్యార్థులకు మేలు చేకూరే లాగా ఉర్దూ మాధ్యమ పాఠశాలలో ఉర్దూ భాష ఉపాధ్యాయులను వాలంటీర్లుగా తీసుకొని వచ్చేందుకు ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకాన్ని ప్రవేశపెట్టడం పట్ల ముస్లిం మైనార్టీలో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుందని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ ఖలీలుద్దీన్ అన్నారు శనివారం స్థానిక పుత్తూరు వారి తోటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే మదర్సాల్లో పనిచేసే వాలంటీర్ల నియామకానికి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూఖ్ ఆమోదం తెలిపారని ఆయన చెప్పారు రాష్ట్రవ్యాప్తంగా 185 మదర్సాలు ఉండగా ఒక్కో మదరసాలో ముగ్గురు చొప్పున 550 మంది విద్యా వాలంటీర్ల నియామకానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం కోసం ఏడాదికి 13 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేశారని మహమ్మద్ ఖలీల్ ఉద్దీన్ తెలిపారు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నూతన విద్యా విధానం అమల్లో దక్షిణాది రాష్ట్రాల్లో ఉర్దూ భాషను ప్రోత్సహించేందుకు అనుమతి ఇచ్చిందని ఆయన చెప్పారు ప్రతి తరగతిలో కనీసం 15 మంది విద్యార్థులు ఉండి ఉర్దూ మాధ్యమం చదివే స్కూల్ లలో గౌరవ వేతనం కింద ఉర్దూ భాష ఉపాధ్యాయుల నియామకానికి కేంద్రం నిధులు కేటాయిస్తుందని కేంద్రం గత ఏడాది దీన్ని అమలు చేసిన గత ప్రభుత్వ హాయంలో వినియోగించుకోలేదని కూటమి ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి నిబంధనల మేరకు ప్రతిపాదనలను కేంద్రానికి పంపించిందని ఆయన చెప్పారు ఒక్కొక్క ఉపాధ్యాయుడికి నెలకు 30000 గౌరవితనం కింద చెల్లించేలా 10 కోట్లను విడుదల చేసిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే అధికారులు ఈ నియామక ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు ఆయన చెప్పారు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనారిటీల కోసం చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఖలీలుద్దీన్ చెప్పారు.

## రెడ్డిపల్లి గ్రామంలో పల్లె పండుగ

# గ్రామాల్లో ఆనందోత్సవాలు











**అమలాపురం .అక్టోబర్ 19.(నవభూమి ప్రతినిధి)** అమలాపురం.. రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమానికి. అమలాపురం మండలంలోని రెడ్డిపల్లి గ్రామం ఇమ్మి డి వరప్పాడు .రోల్లపాలెం తాండవపల్లి కామనగరువు. . చె చిం దాడ గరువు గ్రామాలలో సంబంధించి పలు అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు. అయితా బత్తుల ఆనందరావు శనివారం భూమి పూజ చేశారు. గ్రామంలో రహదారి నిర్మాణానికి 12 లక్షల నిధులు కేటాయించడంతో ఆ పనులు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల నిధులను కేటాయించడం జరుగుతుందని అన్నారు. నాణ్యతకు ప్రాధాన్యతిస్తూ రహదారి నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్ ను ఈ సందర్భంగా సూచించారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆనందోత్సవాలతో ఎమ్మెల్యే ఆనందరావును రమణబాబును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్. ఎంపీడీవో యు. బాజిరాజు. టిడిపి నాయకులు మెట్ల రమణబాబు. బొర్రా ఈశ్వరరావు. కొలిశెట్టి జయప్రకాష్. ఎంపీటీసీ ఆదిలక్ష్మి.టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కరాటం సూర్య భాస్కర్ రావు. కొలిశెట్టి విజయ్. కొలిశెట్టి వీర వెంకటరమణ. గు,ర్రం ధర్మరాజు.టి దుర్గారావు.గ్రామ కార్యదర్శి స్వాతి. వీఆర్వో గంధం దొరబాబు. సచివాలయం సిబ్బంది నల్ల సతీష్. ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్ జ్యోతి తదితరులు ఆయా గ్రామాల నాయకులు మహిళా నాయకురాలు ఎంపిటిసిలు సర్పంచులు మండల అధ్యక్షులు పాల్గొన్నారు

# నిలిచిన అడవిపల్లె ప్రాజెక్టు పనుల్లో కదలిక



**చిత్తూరు(నవభూమి)** ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు తలపెట్టిన అడవిపల్లె ప్రాజెక్టు పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. అమృత్ పథకం కింద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.250 కోట్ల వ్యయంతో అడవిపల్లె నుంచి చిత్తూరుకు పైపులైన్ల ద్వారా తాగు నీరందించే పథకానికి శ్రీకారం చుట్టారు. 75 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను గాలికొదిలేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిన పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది వేసవికల్లా చిత్తూరు నగర ప్రజలకు తాగునీరందించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి.చిత్తూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు నగర జనాభా సుమారు రెండు లక్షలు. రోజుకు 27 ఎంఎల్డీ నీటి అవసరం ఉంది. ఇందులో ఎన్టీయార్ జలాశయం రోజుకు 5 ఎంఎల్డీ(మిలియన్ లీటర్ల నీరు), 450 బోర్ల నుంచి 22 ఎంఎల్డీ నీటిని సరఫరా చేస్తున్నారు. వర్షాలు పడక ఎన్టీయార్ జలాశయం ఎండిపోతే సమీప ప్రాంతాల్లోని రైతుల బావులతో పాటు అదనంగా బోర్లను డ్రిల్లింగ్ చేయడం.. అరకొర నీటిని సరఫరా చేయడం రివాజుగా మారింది.ఈ పరిస్థితుల్లో పలువురు ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు ప్రజల తాగునీటి సమస్యను పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో.. 2018లో అమృత్ పథకం ద్వారా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టింది.రూ.250 కోట్లు.. 95 కిలోమీటర్ల పైపులైను పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు పైపులైన్ల ద్వారా 37ఎంఎల్డీ నీటిని తీసుకురావడానికి 2018లో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి నివేదికలను రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి పంపడంతో అమృత్ పథకం కింద రూ.250 కోట్ల విడుదలకు అమోదం తెలిపి నిధులను విడుదల చేసింది. పనులను ప్రారంభించిన అధికారులు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పూతలపట్టు మండలంలోని ఎ.రంగంపేట క్రాస్ వరకు అంటే సుమారు 75 కిలోమీటర్ల వరకు పైపులైన్ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం టీడీపీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడంతో పైపులైను పనులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది.గత ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పైపులైను కనెక్షన్ పనులు పూర్తి చేసి చిత్తూరు నగరానికి తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు దొరబాబు, కటారి హేమలత, కాజూరి బాలాజీ తదితర నాయకులతో కలసి మే 1వ తేదీన అడవిపల్లె రిజర్వాయర్ను సందర్శించారు.ఈ నేపథ్యంలో ఆగిపోయిన పైపులైన్ పనులను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం రాగానే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రాజెక్టు నుంచి 0.785 టీఎంసీ నీటి ఉపసంహరణ, ఇంటెక్‌వెల్ అనుమతి కోసం జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ నుంచి ప్రభుత్వానికి లేఖ పంపించాల్సి ఉంది.ఎ.రంగంపేట క్రాస్ నుంచి చిత్తూరు నగరానికి 15 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ వేయడానికి జాతీయ రహదారుల శాఖ అనుమతి నిరాకరించగా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. అలాగే దామల చెరువులోని పుదిపట్లబయలులో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి తిరుపతి ఆర్డీవోతో, పాకాల తహసీల్దార్‌తో సంప్రదిస్తున్నారు.గత ఐదేళ్ల కాలంలో అడవిపల్లె ప్రాజెక్టు పనులు సాంకేతిక కారణాలతో ముందుకు పోలేదు. ప్రస్తుతం వివిధ దశల్లో ఆగిపోయిన పనుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

# ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్యం నూతన కమిటీ ఏర్పాటు



**కౌతాళం, అక్టోబర్ 19(నవభూమి న్యూస్ ):** మండలంలోని ఉరుకుంద గ్రామంలో కమ్యూనిటీ హాల్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్య వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కట్ట స్వామి దాసు ముఖ్య అతిథిగా అడ్వకేట్ ఎస్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ దళిత సమైక్య మండల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా కట్ట విజయ మోహన్ కుమార్, ఉపాధ్యక్షులుగా గుడికంబాలు మారెప్పను, కార్యదర్శిగా చూడి అబ్రహాము, సహాయ కార్యదర్శిగా బాపురం ఉలిగ ప్ప, సెక్రెటరీగా కాత్రికి ప్రకాష్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా మరలి ముఖేష్ , కామవరం తిమోతి , బాపురం దేవన్న, లింగలదిన్నె నాగరాజ్ , నదిచాగి హుసేనిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంటి స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించడం, మండల స్థాయిలో గురుకుల మరియు ఐటిఐ కళాశాలలను ఏర్పాటు చేయడం, గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించడం, అంటరానితనం నిర్మూలన జరగాలని వలస కూలీలకు హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఈ కమిటీ తీర్మానించడం జరిగింది. ఈ విషయాలపై మండలంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ దేవస్థానం 5వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**నెల్లూరు,అక్టోబర్ 19,(నవభూమి)::** నెల్లూరు జిల్లాలోని మనుబోలు మండల కేంద్రంలో కోదండరామాపురం ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ దేవస్థానం ఐదోవ వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ దేవస్థానం ప్రతిష్ట చేసి నాలుగు సంవత్సరాలు పూర్తయిందని.. 5వ సంవత్సరం దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించామన్నారు.ఐదవ వార్షికోత్సవానికి సహకరించిన దాతలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.





## మానవ అక్రమ రవాణా

# వ్యతిరేక నిశ్శబ్ద ర్యాలీ

### ◆ వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక






**కావలి, నెల్లూరు జిల్లా, నవభూమి :** బానిసత్వం లేని ప్రపంచంగా చేయండమే లక్ష్యంగా విద్యార్థులు కావలి పట్టణంలో ర్యాలీ చేసారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేఖ నిశ్శబ్ద ర్యాలీ కార్యక్రమం అంతర్జాతీయ ఎన్జీవో ఆస్ట్రేలియా ఏ 21, ది మూమెంట్ ఇండియా ముంబై వారి సహకారంతో గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సౌజన్యంతో స్థానిక ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్ ఖాదర్ బి,రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో పాతూరు మున్సిపల్ హైస్కూల్ హెచ్ ఎం సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి డిఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం మేము నడిచే నడక న్యాయం, మానవ గౌరవం కోసం ఆశా, పునరుద్ధరణ కోసం నడిచే నడక ప్రతి అడుగులో బానిసత్వాన్ని నిర్మూలిస్తాం అంటూ తెలిపారు. బానిసత్వం లేని ప్రపంచంగా చేయండం సాధ్యమే, మానవ అక్రమ రవాణా వల్ల ఎంతో మంది జీవితాలను నాశనం చేస్తుందన్నారు. ఒక మనిషి స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా చేస్తూ బానిసలు గా మారుస్తున్న విధానాన్ని వివరించారు. ఎక్కువగా మహిళలు, చిన్నారులు, తల్లులు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆడ మగ అని తేడా లేకుండా చదువు లేని వారిని అమాయక ప్రజలను బానిస కార్మికులుగా చేసి వారి బతుకులను, కుటుంబాలను నాశనం చేస్తున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేఖ నిశ్శబ్ద ర్యాలీతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేము వేస్తున్న ప్రతి ఒక్క అడుగులో అనేకమందిని చేరుకోవడంతో వారి పరిస్థితులు చేస్తున్నామని, ప్రతి ఒక్క అడుగులో అనేకమంది బాధితులు రక్షింపబడాలని, అలాగే ప్రతి ఒక్క అడుగులో మేము మరిన్ని ప్రాణాలు పునరుద్ధరించడానికే చూస్తామని బానిసత్వం ఇప్పటికీ ఉంది కానీ మేము దాన్ని ప్రతి అడుగుతో ప్రతి చోటా బానిసత్వం లేకుండా చేయడానికి ప్రయత్నమని తెలిపారు. అలాగే ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ 2024 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 49.6 మిలియన్ల మంది ప్రజల అవయవాల దోపిడి, లైంగిక శ్రమ బలవంతపు వివాహాలు, గృహ దాస్యంతో సహా వివిధ రకాల ఆధునిక బానిసత్వంలో చిక్కుకొని ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం 21 శతాబ్దంలో కూడా బానిసత్వం ఇంకా ఉంది, మనుషులను మనుషులుగా చూడకుండా వ్యక్తులు వస్తువులుగా కొనబడుతు విక్రయించ బడుతున్నారన్నారు. అంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 150 మందిలో ఒక్కరు బానిసలుగా ఉన్నారని బాలికలు ప్రధానంగా లైంగిక దోపిడీకి మహిళలు బాలికలు చిన్నారులే బలే అవుతున్నారు. అబ్బాయిలు బలవంతపు శ్రమ కొరకు వాడబడుతు ఉన్నారు, గృహ హింస బలవంతపు వివాహం సైనికత్వం మొదలైన వాటికోసం దోపిడీ చేస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా లేని సమాజాన్ని మనం అందరూ చూడాలనుకుంటున్నాం అందరికీ అవగాహన కల్పిస్తూ అలా జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని,మహిళలు ఎవరి వల్లనైనా ప్రమాదానికి గురైతే వారు హెల్ప్ లైన్ నెంబర్లను తెలియజేస్తూ 1098కి 181 కాల్ చెయ్యాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తనను తాను రక్షించుకోవాలని ప్రతి విషయంలో అవగాహన కలిగి ఉండాలని ఈ నిశ్శబ్ద నడక ద్వారా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గుడ్ మెన్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సోమి శెట్టి బ్రహ్మయ్య, వి సేవా ఫౌండేషన్ చైర్మన్ వినయ్ కుమార్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్ ఖాదర్ బి, రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్, స్కూల్ హెడ్ మాస్టర్ సుబ్బారావు, ఉపాధ్యాయని దయాలత, సుభాషిణి , మస్తాన్ వలీ, మదుసూదన్, విద్యార్ధి ని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పక్షం రోజుల్లో ఖాళీ చేయండి



**ఆంధ్రజ్యోతి, (నవభూమి)::** రైల్వే భూముల్లో ఏర్పాటైన పాత రాజరాజేశ్వరిపేటను పక్షం రోజుల్లో ఖాళీ చేయాల్సిందిగా విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఈ ప్రాంతంలో శుక్రవారం దండోరా వేయించటం తీవ్ర కలకలాన్ని సృష్టించింది. కొన్నాళ్లుగా పాత రాజరాజేశ్వరి పేట వాసులకు నోటీసుల మీద నోటీసులు ఇస్తున్న రైల్వే అధికారులు అంతిమంగా భవనాలను కూలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇళ్లకు సీరియల్ నంబర్లు వేస్తూ మార్కింగ్ కూడా ఇచ్చారు. తాజాగా ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా దండోరా వేయించారు. 40 ఏళు ్లగా మొద్దు నిద్రలో రైల్వేశాఖ విజయవాడ– హైదరాబాద్ రైల్వే మార్గం వెంబడి రైల్వేస్థలాలు నలభై ఏళ్ల కింద టి నుంచి ఆక్రమణలకు గురవుతూ వస్తున్నాయి. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా విజయవాడ ఉండటంతో ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వలసలు వచ్చిన పేదలు విజయవాడ జంక్షన్ పరిధిలోని రైల్వే స్థలాల్లో ఇళ్లు వేసుకున్నారు. వీటిలో పాత రాజరాజేశ్వరిపేట ప్రధానమైన ఆక్రమణ ప్రాంతంగా మారింది. ఏకంగా ఒక కాలనీగా రూపాంతరం చెందింది. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన రైల్వే అధికారులు ఇన్నాళ్లూ మొద్దునిద్ర పోయారు.నాలుగు లైన్లకు పెంచాలన్న ప్రతిపాదనలతో..విజయవాడ – హైదరాబాద్ రైలు మార్గం ప్రస్తుతం రెండు లైన్లుగా ఉంది. దీనిని నాలుగు లైన్లకు పెంచాలన్న ప్రతిపాదనలు నడుస్తున్నాయి. వీటికి సంబంధించి డీపీఆర్‌లు కూడా జరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో రైల్వేశాఖ తమ స్థలాలలోని ఆక్రమణలపై దృష్టి సారించింది. విజయవాడ – హైదరాబాద్ మార్గంలో అదనపు పాసెంజర్ రైళ్లతో పాటు గూడ్స్ లైన్స్ వంటివి విస్తరించటానికి కూడా రైల్వేకు తమ భూములను స్వాధీనం చేసుకోవడం చాలా ముఖ్యంగా మారింది.ఐదెకరాల్లో విస్తరించిన కాలనీ పాత రాజరాజేశ్వరిపేట 40 ఏళ్ల కిందటే ఆక్రమణల రూపంలో ఏర్పడింది. నేడు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అతి పెద్ద కాలనీగా అభివృద్ధి చెందింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో అంతర్భాగంగా మారిపోయింది. సుమారు ఐదెకరాల్లో విస్తరించి ఉంది. సాధారణ డివిజన్ల మాదిరిగానే ఈ ప్రాంతంలో కూడా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటయ్యాయి.

# మహాకుంభాభిషేక మహెూత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని.. తీర్థప్రసాదల స్వీకరించండి

## శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు







**నెల్లూరు,అక్టోబర్ 19,(నవభూమి)::**నెల్లూరు జిల్లాలోని మనుబోలు మండల పరిధిలో బద్దెవోలు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్ నిర్మాణం ప్రారంభం సందర్భంగా వేద పండితులు ఆధ్వర్యంలో మేళ వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి.. శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానని పునర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి,పరివార దేవతల నూతన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహెూత్సవం మూడు రోజుల పాటు జరుగుతుందని.. సోమవారం పరివార దేవతల విగ్రహ ప్రతిష్ట తో పాటు,ధ్వజ స్తంభం ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ మహెూత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని.. తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి తాత శ్రీనివాసరావు, దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు,స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు బదినే హాల్

## క్రీడాకారిణిలు ఎంపిక

**కౌతాళం, అక్టోబర్19(నవభూమి న్యూస్ ):** అవుట్ డోర్ స్టేడియం కర్నూల్ లో కర్నూలు జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి బాలికల ఖో ఖో సెలక్షన్స్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బదినే హాల్ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రజియా,ఏడవ తరగతి చదువుతున్న ఉషలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాధ రావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణిలు ఈనెల 25 నుండి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాధ రావు, ఉపాధ్యాయ బృందము ఎంపికైన క్రీడాకారునిలను అభినందించారు



# ఏపీ ఎంఎఫ్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం. అక్టోబర్19.( నవభూమి ప్రతినిధి)** ఏపీ ఎంఎఫ్ ఆహ్వాన పత్రికను అమలాపురం ఎమ్మెల్యే . అయితా బత్తుల ఆనందరావు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు .అనంతరం ఆయన ఏపీఎంఎఫ్ మహాసభ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు చెల్లిబోయిన శ్రీనివాస్. టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్ బాబు పాత్రికేయులు చొల్లంగి అప్పాజీ .గుత్తుల వెంకటరమణమూర్తి. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్ని సౌకర్యాలతో రైతుబజార్ సిద్ధం



**మదనపల్లె (నవభూమి)::** రైతులకు అన్ని సౌకర్యాలతో రైతు బజార్ సిద్ధం చేశామని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు బజార్‌ను పరిశీలించిన ఏడీఎం పలువు రు రైతులతో చర్చించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతు బజార్ లో రైతులు ఉత్పత్తులు విక్రయించుకునేలా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల రైతులు వారి భూమి పాసుపుస్తకాల జిరాక్స్, లేదా కౌలు రైతుల సర్టిఫికెట్లతో తమకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తులు తీసుకొచ్చి రైతుబజార్‌లో విక్రయించేవారికి ఎలాంటి గేటు రుసుం, దళారుల కమిషన ఉండవన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో మదన పల్లె చుట్టుపక్కల అన్ని గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమం లో హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌రెడ్డి, ప్రకృతివనం ప్రసాద్, కంగేరి నంద, రైతులు పాల్గొన్నారు.

# ఫ్రీహెూల్డ్ వెరిఫికేషన బాధ్యతగా చేయండి

**పెద్దమండ్యం, (నవభూమి)::** ఫ్రీహెూల్డ్ ల్యాండ్ వెరిఫికేషనను బాధ్యతగా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన అధికారులను ఆదేశించారు. పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయం లో శుక్రవారం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, వీఆర్‌వోల తో సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో ఫ్రీహెూల్డ్ ల్యాండ్ రికార్డుల వెరిఫికేషనను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫ్రీహెూల్డ్ రికార్డులను జాయింట్ కలెక్టర్‌కు అందజేసి వివరాలను తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఫ్రీహెూల్డ్‌లో న్న భూమి వివరాల రికార్డులను పరిశీలించారు. తప్పులు లేని రికార్డులను సిద్ధం చేయాలన్నారు. మండల సర్వే యర్ హసీనతాజ్, మండల ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



# తంబళ్లపల్లెలో విద్యుత సిబ్బంది కొరత



**తంబళ్లపల్లె, (నవభూమి)::** తంబళ్లపల్లె మండలంలో గ్రామాలకు సరిపడా విద్యుత శాఖ సిబ్బంది లేకపోవడంతో విద్యుత సమస్యలు సకాలంలో పరిష్కారం కాక వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె మండలంలో 21 పంచాయతీలు ఉండగా తంబళ్లపల్లె, కన్నెమడుగు, గోపిదిన్నె, కోసువారిపల్లె, కుక్కరాజుపల్లెల్లో 33/11 కేవి విద్యుత ఉపకేంద్రాలు ఉన్నాయి. ఈ ఉపకేంద్రాల పరిధిలో తంబళ్లపల్లె, కన్నెమడుగు, రేణుమాకులపల్లె, కుక్కరాజుపల్లె, కోటకొండ, గుండ్లపల్లె, దిగువపాళ్యం, గంగిరెడ్డిపల్లె, పంచాలమర్రి, గోపిదిన్నె, కొటాల, జుంజురపెంట కోసువారిపల్లె డిస్ట్రిబ్యూషన్లు ఉన్నాయి. వాటికి లైనమెన్లు, ఏఎల్ఎం (అసిస్టెంట్ లైనమెన)లు, జేఎల్ఎం (జూనియర్ లైనమెన)లు కలిపి మొత్తం 13 మందికి పైగా విద్యుత సిబ్బంది అవసరం. అయితే తంబళ్లపల్లె టౌన, రేణుమాకులపల్లె, కోటకొండ, కుక్కరాజుపల్లె, కోసువారిపల్లెకు ముగ్గురు (ఇద్దరు గ్రేడ్–2), గోపిదిన్నెకు(గ్రేడ్–2) మాత్రమే సిబ్బంది ఉన్నారు. కన్నెమడుగు, పంచాలమర్రి, గుండ్లపల్లె, తంబళ్లపల్లె రూరల్, కొటాల డిస్ట్రిబ్యూషనలకు సిబ్బంది లేరు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత సమస్యలు వస్తే ఎవరికి చెప్పాలో తెలియక వినియోగదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది లేని గ్రామాల్లో సమస్యలు తలెత్తితే ఇతర గ్రామాల లైనమెన్లు కానీ, విద్యుత ఉప కేంద్రాల డ్యూటీ ఆపరేటర్లు వెళ్లి సమస్యను పునరుద్ధరించాల్సి వస్తోంది. దీంతో విద్యుత సరఫరాలో తీవ్ర జాప్యం కలుగుతోంది. ముఖ్యం గా తంబళ్లపల్లె టౌన, రూరల్‌కు కలిపి ఒక లైనమెన, ఒక ఏఎల్ఎం, ఒక జేఎల్ఎం ఉండాల్సి ఉండగా.. ఒక లైనమెన మాత్ర మే ఉన్నారు. దీంతో తంబళ్లపల్లె టౌన, రూరల్‌లో విద్యుత లైన్ల లో సమస్యలు వచ్చినపుడు సిబ్బంది ఒక్కరే ఉండటంతో పునరుద్ధరించడంలో ఆలస్యం అవుతోంది. విద్యుత ఉన్నతాధికారు లు స్పందించి మండలానికి అవసరమైన సిబ్బందిని కేటాయించాలని వినియోగదారులు, రైతులు కోరుతున్నారు. సకాలంలో సమస్యలను పరిష్కరిస్తున్నాం ట్రాన్సకో ఏఈ, శేషు. తంబళ్లపల్లె తంబళ్లపల్లె మండలంలో సిబ్బందిలేని గ్రామాల్లో విద్యుత సమస్యలు తలెత్తితే వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా అందుబాటులో ఉన్న లైనమెన్లతో సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నాం. మండలంలో ఏయే గ్రామాలకు సిబ్బంది అవసర మో ఉన్నతాధికారులకు తెలియచేశాం. త్వరలో జరిగే బదిలీలలో తంబళ్లపల్లె మండలానికి పూర్తి స్థాయిలో సిబ్బంది వస్తారు.

# ఎమ్మెల్యే గారూ.. ఇటు వైపు కూడా చూడండి

**కడప (నవభూమి)::**ఎమ్మెల్యే మేడం గారూ.. ఈపక్క కూడా ఒక్కసారి దృష్టి సారించండి. కడప కార్పొరేషనగా ఏర్పడక ముందు మేజరు పంచాయతీల్లో రా మరాజుపల్లె పంచాయతీ ఒకటి. గత పాలకు లు ఈ పంచాయతీపై పూర్తి వివక్ష చూపారు. కార్పొరేషనలో విలీనం అయిన తరువాత రా మరాజుపల్లె పంచాయతీ 48వ డివిజనులోకి చేరింది. ఇక్కడున్న ప్రజానీకమంతా పేద బడుగు, బలహీన వర్గాలే అని చెప్పాలి. గత పదిసంవత్సరాల నుంచి హెూమియోపతి కళాశాల ప్రాంతం విస్తరిస్తోంది. అయితే కార్పొరేషన అధికారులకు వారికి రావాలసిన ఫీజులు, పన్నులు వసూలు చేసుకుంటున్నారు కానీ వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పాలి. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ డివిజనపై ప్రధానంగా హెూమియోపతి కళాశాల రోడ్డుపై దృష్టి సారించి స మస్యలు పరిష్కరిస్తారనుకుంటే కడప ఎమ్మె ల్యే మేడం మాత్రం ఇంత వరకు ఈ ప్రాంతంలో పర్యటించిన దాఖలాలు లేవు. ఎంత సేపు టౌన ప్రాంతాల్లో, పాతకడప ప్రాంతాల్లో మాత్రమే పర్యటిస్తుంటారు. ఈ ప్రాంతంలో పర్యటిస్తే ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయి కదా అని ప్రజలు అనుకుంటున్నారు. ఎమ్మెల్యే మేడం.. స్పందించి దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు. 48వ డివిజనులో రామాంజనేయనగర్, సనసిటి, ఏఎసఆర్ నగర్, ఆచారి కాలనీ, చెంచుకాలనీవాసులకు హెూమియోపతి కళాశాల రోడ్డు ప్రధానమైనదని చెప్పాలి.